
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!!సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!

# గురుకృప

గురో పినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా!సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతి హిదే జగత్పావనా!



ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి : 4 సంచిక : 2 త్రైమాసిక పత్రిక మార్చి - 2001

## సాయివంటి దైవంబు లేడోయ్! లేడోయ్ !!



ప్రజలందరి నోట సాయి నామం పలకాలి!
సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద పీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయి వంటి దైవంబు లేడోయ్! లేడోయ్!!'
అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
-- అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో
ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

---- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో


| | | |
|---|---|---|
| 1. | సాయివంటి దైవంబులేడోయ్!లేడోయ్ | |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట - | గురు బంధువులు |
| 3. | మనసును నియమించే మర్మాలు | శ్రీ బాబూజీ |
| 4. | ఇదే గురువుగారి సర్వజ్ఞత | పి. సూర్యనారాయణ |
| 5. | లేదన్నది లేనిదే గురుసన్నిధి | జి.పి. సతీష్ కుమార్ |
| 6. | నిత్య జీవితంలో సూర్యుని వెలుగు | పి. దక్షిణా మూర్తి |
| 7. | ఋణానుబంధం ఏమిటి? | రాధాబాయి |
| 8. | కిం వచనీయం గురు మహిమ | డి. జనార్ధనరావు. |
| 9. | బాబాని నమ్ముకో... | జి. సుష్మిత |
| 10. | అదే అనుగ్రహం - ఇదే నిదర్శనం | పి. రాజ్యలక్ష్మి |
| 11. | ఆ రూపం అపురూపం | డి. హనుమేశ్వరి. |
| 12. | ఆ చేయి ఎంత హాయి (భాగం - 12) | ఎస్. సాయి వరప్రసాద్ |

# ఉన్నమాట - అనుకున్నమాట

"గురువనే" మాట సంబోధనకాదు సరదాగా పిల్చేదికాదు. కాలక్షేపంకోసం అనుకొనేదికాదు. ఎదుటి వారిని గౌరవించేందుకు పిలిచే పిలుపూకాదు. "గురువంటే" ఏమిటో? గురువంటె ఎవరో తెలుసుకోవాలి? ఎంత వర్ణించినా? ఎంతగా వివరించినా? ఎంతగా పాడుకొనినా? తనివితీరనిది. తృప్తి చెందనిది - గురునామం! ఎన్నిసార్లు చూచినా ఎన్నిరోజులున్నా ఇంకా ఇంకా చూడాలనిపించేది గురుస్వరూపం. పతితులను పావనులుగా మార్చేది గురువే! సచ్చిదానందాన్ని అనుగ్రహించేది గురువే. సమస్త సదుపాయాలు. సౌకర్యాలు సమకూర్చేది గురువే. ఒకమాటలో చెప్పాలంటే నీకేది మంచిదో నీకేది చెరుపో చాటి చెప్పేది గురువే. నీ పాలిట మిత్రుడు, బాంధవుడు, సచివోత్తముడు, మనకు నెయ్యము, వియ్యము, సర్వము గురువే! ఆటలాడినా, పాటపాడినా, మాతి విరిచినా! కయ్యమాడినా గురువుతోనే - అదో ఆనంద వేల, రస స్వరూపాల సంగమం. నీ సుఖం, నీ కష్టం, నీ సంతోషం, నీ దుఃఖం, అంతా ఓపికగావినేది గురువే! ఆదుకొనేది గురువే!

దరి చేర్చుకొనేది గురువే, ఆర్తి తీర్చి అక్కున హత్తుకొనేది గురువే. అలాంటి సద్గురువు నీ అదృష్టంకొద్దీ నీ పూర్వజన్మ పుణ్యంకొలది అరుదుగా ఆవిర్భవించి నిన్ను ఉద్ధరిస్తున్నది గురువే. అటువంటి సద్గురువును సందర్శించి పిపీలికాదులు పరవశించి పోతున్నవి. ప్రేమావిర్భావమై ఆగురుచరణ సన్నిధిలో మైమరచి పోవాలని, ఆ ప్రకృతిలో తానో ఆకృతిని చెందాలని, కరిగిపోవాలనే ప్రయత్నాలు ముమ్మరంగా సాగిపోతున్నవి. రసస్వరూపమైన సద్గురుని స్వరూపం దర్శించినంత మాత్రాన ఇహపరశ్రేయోదాయిగా మన కన్పిస్తుంది. కొంగుబంగారమై కోర్కెలను ఈడేర్చుతుంది. ఆది దైవమై ఆధ్యాత్మికానుభూతిని పెంపుచేస్తున్నది. అందుకనే ఈ జగత్తంతా అతనికి దాసోహమంటుంది. క్రిములు, కీటకాలు, మృగాలు, విరులు, తరులు, ఝురులు, కుధరాలు, సమస్తమా గురుదేవునికి వశమైపోతాయి. కాని మానవుని విషయం కొంత భిన్నంగా వర్తిస్తుంటుంది.

గురుశిష్యాను రాగం మధురాతి మధురమైన మధుకీల వంటిది. ఆధ్యాత్మికమనే పరమపదసోపాన పటంలో పావు అనే శిష్యుణ్ణి భక్తి, విశ్వాసాలనే పాచికలతో కర్మబంధాలంటని పందెం వేయించి రాగ బంధాలనే పాముల పాలిటి పడనీయకుండా అనుగ్రహమనే నిచ్చెనను అవలీలగా ఎక్కించి అనాయాసంగా గమ్య స్థానానికి చేర్చేది గూడా గురువే. గురు బోధనను శ్రద్ధగా వినటంతోనే శిష్యుని కర్తవ్యము తీరిపోతుందా! గురు సూక్తులను గోడల మీద, గుడ్డ బ్యానర్ల మీద, సైన్ బోర్డుల మీద రకరకాలు వ్రాయించితే సరిపోతుందా! మైకుల ముందు కూర్చొని గంటల తరబడి ఉపన్యాసమిస్తే అయిపోతుందా? కమ్మని భోజనాన్ని చూస్తుంటే ఆకలి తీరుతుందా.

సూక్తి సుధను ఆస్వాదించి తాము ఆచరణలో చూపి తోటి వారిని ఆచరించేలా చేయుటమన్నది నిజమైన గురు సేవనిపించుకుంటుంది. తోటి గురుబంధువులకు, గురుపరంగా సాగిపోయే చక్కని పనులకు చేయూతనీయడములో గురుసేవానందాన్ని పొందుతారు. గుర్వచనాన్ని అమలుపర్చటం కంటె మించిన శ్రద్ధ మరెక్కడుంది? దానికై నిరంతరం కృషిచేయడమే భక్తంటె. గురుభావాలను ఆచరించడమే విశ్వాసమంటే. ఆ మనసుకేది ఇష్టమో, అలా మనం మసలుకోవటమే ప్రేమంటే.

నిర్మాణమైన గురు సదనాన్ని స్వార్థమనే బూజుపట్టకుండా, స్వలాభమనే ధూళి రాకుండా, త్యాగమనే చీపురునుపయోగించాలి. శుభ్రపర్చుకోవాలి. మమతల వెల్లలను వేయాలి. ధృఢ విశ్వాసమనే స్తంభాలను పటిష్ట పర్చుకోవాలి. నిజాయతీయనే ఫలకాన్ని ఇంటి ముందు బిగించుకోవాలి. సత్యమనే దీపాన్ని వెలిగించుకోవాలి. "ధర్మమనే" వంటను చేసుకోవాలి. నీతి యనే పందిరిని పాతుకొనాలి. ఆదర్శమనే మొక్కను నాటి ఆచరణమనే పూలు పూయించి ఆగురువు మెడలో అలంకరిస్తే "శిష్యుడనే దండ" కలకాలం వెలుగుతుంది.

-- గురుబంధువులు



*ఒకే దైవం*
*ఒకే ధ్యానం..*
*ఒకే ధ్యేయం...*

*...సాయిబాబా.*
*సాయిబాబా..*
*సాయిబాబా...*

*- శ్రీ బాబూజీ*

## మనసును నియమించే మర్మాలు!

(మే 1988 సాయి పథం నుండి)

"నన్ను కేవలం ఆనందస్వరూపంగా ధ్యానించు! అది చేతకాకుంటే, నిత్యం నీవుచూచే ఈ నా రూపాన్ని ధ్యానించు!" అన్నారు శ్రీసాయిబాబా, బాబా మొదట ఆదేశించిన నిరాకార ధ్యాన మార్గానికి సంబంధించి కొన్ని సుళువులను, పద్ధతులను క్లుప్తంగా తెలుసుకొందాం.

1. ఎటువంటి శ్రమ, బిగింపు అవసరం లేకుండా హాయిగా ఎక్కువసేపు కూర్చొనగలిగిన ఆసనంలో కూర్చొని, మనసారా బాబాను స్మరించి అసలైన ఆయన స్వరూపాన్ని సాక్షాత్కరింప చేయమని మనస్సులో ప్రార్థించాలి.

2. కళ్ళు మూసుకొని, మనస్సులో ఏ రూపాన్నీ భావించకుండా, నిరామయం చేసుకొని బాబా నామాన్ని మనస్సులో జపించటం ప్రారంభించాలి.

3. జపం ప్రారంభించిన వెంటనే ఏవేవో ఆలోచనలు కూడా తోటే మొదలవుతాయి. సాధన ప్రారంభంలో అలా ఆలోచనలు వస్తున్నట్లు కూడా మనకు గుర్తింపుకురాదు. ఆ ఆలోచనలతో ఎంత తాదాత్మ్యం చెందుతామంటే ధ్యానానికి కూర్చున్నంతసేపు, ధ్యానమో, జపమో ఏకాగ్రతగా చేస్తున్నామని భ్రమపడతాం! కానీ కొంతకాలం శ్రద్ధతో సాధన కొనసాగించి, మనస్సు అంతర్ముఖం కావటం 'మొదలైన' తరువాత, ధ్యానం సరిగ్గా కుదరటంలేదనీ, ఆలోచనలు తెరలుతెరలుగా ఎంత ఆపినా ఆగకుండా వస్తూనే వున్నాయని గుర్తించి, ఆందోళన చెందుతాం. కానీ అది శుభసూచకం! ఎందుకంటే మొదట మన 'శత్రువు' వునికిని గుర్తించ గలిగాం కదా!

4. నిరామయంగా వున్న మనస్సులో ఆలోచన పుట్టీపుట్టగానే గుర్తించి, వెంటనే త్రుంచెయ్యాలి. త్రుంచేస్తుండే కొద్దీ, మరో ఆలోచన వెను వెంటనే పుట్టుకొస్తుంది. 'రావణాసురినితలల' మాదిరి. ఈ ఆలోచనా ప్రవాహం లోని చిత్రమేమంటే. ఆలోచన పుట్టిన వెంటనే అది మన గుర్తింపులోకి రాదు. కొంతసేపు గడిచాక 'అరె! ఆలోచన!!' అని గుర్తిస్తాం. గుర్తించిన వెంటనే ఆ ఆలోచన ఆగిపోతుంది. కానీ మనకు 'తెలియకుండానే' మరో ఆలోచన మొదలైయుంటుంది! ఇలా ఆలోచనలను గుర్తించడం. ఆ 'గుర్తింపు' అనే ఖడ్గంతో ఆలోచనలను ఖండించడం అనేవి తిరిగి తిరిగి విసుగు లేకుండా చేస్తూ వుండాలి. ఆలోచన మొదలయ్యీ అవ్వకముందే గుర్తించ గలిగితే మనం సాధనలో మొదటి మెట్టుకు దగ్గరగా వున్నామన్నమాట!

5. అలా ఆలోచనలు త్రుంచెయ్యడములో మనం గుర్తుంచుకో వలసిన విషయం - 'ఏ ఆలోచనైనా ఆలోచనే' గాని వాటిలో "మంచి" "చెడు" తారతమ్యం మన కవసరం లేదు. మనం 'పాపమని, దోషమనీ' అనుకొనే, ఆలోచనలు వచ్చినప్పుడు ఆ 'పాప చింతన' గురించి చింతతో చింతించడంవంటి పొరపాట్లు చెయ్యకూడదు. మన ఆలోచనలలోని సారాంశం పట్ల, వాటి మంచి చెడ్డల పట్ల నిర్లిప్తతవహించగలిగే వివేకం, దృక్పథం

రావాలి. అప్పుడే ఆలోచనలకాధారమైన భావాలను మొగ్గలోనే చెరిపేసి, అవి మానులుగా రూపుదిద్దుకోనివ్వకుండా జాగర్తపడగలం. మన లక్ష్యం ఆలోచనలను అధిగమించడమే. అందుకే భగవాన్ రమణ మహర్షి అంటారు. "ఆలోచించడమే పాపం!" ("To think is sin") అని.



మేరెక్కడున్ననూ
ఏమి చేయుచున్ననూ
నాకు తెలియునని
బాగుగా
జ్ఞాపకముంచుకొనుడు

--సాయిబాబా

6. ఆలోచనా ప్రవాహాన్ని అలా అడ్డుకట్టవేయాలని ప్రయత్నించి, ప్రయత్నించి ఒక దశలో అలసి పోతాము. అప్పుడు తెరలు తెరలుగా క్రమ్ముకొని వస్తున్న ఆ ఆలోచనలతో తాదాత్మ్యం చెందకుండా, ఆ ఆలోచనా ప్రవాహాన్నుండి విడి వడి, వాటిని సాక్షిగా చూస్తుండడానికి యత్నించాలి. దీన్నే - 'మంచి ఈతగాడు సముద్రంలో లోతుకు పోవాలనుకొన్నప్పుడు మొదటవుండే అలల తాకిడి నుండి తప్పుకోవడనికి ఎలాగైతే నీటిలో మునిగి అల తన తలపై నుండి దాటి పోగానే ముందుకు సాగుతాడో అలాగు' - అని వర్ణిస్తారు భగవాన్ రమణ మహర్షి. ఆలల తాకిడి నీటి ఉపరితలం పైనే కానీ, లోతుకు పోయే కొద్దీ ఎలాగైతే వుండదో అలాగే ధ్యానంలో లోతుకు పొయ్యేకొద్దీ ఆలోచనల తాకిడి తగ్గుతుంది.

7. ఇలా చెయ్యగా ఆలోచనలు ఒకదశలో ఆగి పోతాయి అప్పుడు జపమూ ఆగుతుంది. అంటే జపం అజడమవుతుందన్నమాట. సాధనకు కావాల్సింది ఓటమితో రాజీపడని పట్టుదల, నిస్పృహ విసుగు లేని ఓరిమి - అవే బాబా కోరిన నిష్ఠ, సబూరిలు.

అలా మనస్సు ఏ ఆలోచన లేక నిరామయమైన స్థితిలో ఎంతసేపు వుండగలిగితే అంతసేపు వుండగలగాలి. సాధారణంగా ముందు చెప్పిన పద్ధతులలో యత్నించి, మనసు ఆ స్థితిలో నిలవగానే, ధ్యానం నుండి లేవడం జరుగుతూ వుంటుంది! కానీ ఆలోచనలు అణిగిన క్షణం నుండే నిజమైన ధ్యానం ప్రారంభమవుతుంది. మనస్సు ధ్యానానికి కూర్చున్నవెంటనే అంతర్ముఖమై ధ్యానస్థం కావాలంటే, నిత్యజీవితంలో మన వ్యవహారము, ఆలోచనాసరళి, ఆహార విహారాలు సరిగ్గా వుండాలి. అవి ఎలా వుండాలో అన్న అంశం, యీ సాధనకు సంబంధించిన మరికొన్ని అంశాలు ముందు ముందు తెలుసుకొందాం.

## ఇదే గురువుగారి సర్వజ్ఞత

నాకు షిరిడీ వెళ్ళవలెనని చాలాకోరికగా ఉండేది. కాని అవకాశము, ఆర్థిక బాధతో వెళ్ళలేక ఇంటి దగ్గరే సాయిబాబాకు, గురువుగారు శరద్బాబూజీకి పూజలు చేసుకొనుచున్నాను. ఆ బాబా కృప, గురుదేవుని అనుగ్రహం వలన మా పెద్దకుమారుడు పారేపల్లి సాయి దుర్గారావు తెనాలిలో ఉంటున్నాడు. బాబు తెనాలిలో సత్సంగమునకు వెళ్ళుట, ఇంటి వద్ద పూజలు చేసుకొనుచున్నాడు. 17-10-99న వాళ్ళు శిరిడీ బయలుదేరుచు నాకు కుడా టికెట్ రిజర్వు చేయించినారు. అది వినగానే నాకు చాలా ఆనందం కలిగినది. కాని ఆరోగ్యం సరిగా లేదు కనుక ఎట్లా వెళ్ళాలా? అని బాబాను, గురువుగారిని అడిగాను. ఆరోజు నుండి శిరిడీ వెళ్ళే రోజుకు ఆరోగ్యం కుదుట పడినది. వెంటనే తెనాలి వెళ్ళి మా అబ్బాయిని కలుసుకొని గురుబంధువలందరితో కలిసి శిరిడీ వెళ్ళినాను. 5 రోజులు శిరిడీలో ఉన్నాము. ప్రతిరోజు శిరిడీ సాయినాథుని దర్శనము ఆశ్రమములో భజనలు, ప్రతి రోజు గురువుగారి దర్శనము చేసుకున్నాము.



'గురువు' యందు
అత్యంత భక్తి
శ్రద్ధలు గలవాడు
"గురువు"
సమక్షంలో వున్నా,
దూరాన వున్నా
ఒకటే

-- మిలారెపా

22-10-99న శుక్రవారం నాడు గురువుగారు 3 గంటలకు దర్శనమునకు అవకాశమిచ్చినారు. నాకు అరికాళ్ళ పగుళ్ళు వచ్చి 12 నెలలయినా, ఎన్ని మందులు వాడినా కాని తగ్గలేదు. గురుదేవునకు పాదనమస్కారము చేసుకొంటూ చెప్పుకొందామని అనుకొన్నాను. కాని ఆ ఆనందములో దుఃఖము వచ్చి, కళ్ళవెంట నీరు కారుతుండగా ఏమీ చెప్పలేక పోయినాను. అయినా గురువుగారు నా వంక చూచి ఊదీ పెట్టినారు. ఎన్ని మందుల వలన కూడా తగ్గని నా అరికాళ్ళ పగుళ్ళు తగ్గిపోయి మామూలు అరికాళ్ళ లాగా అయినవి. మనము చెప్పకపోయినా గురువుగారికి అన్నీ తెలుసునని నాకు అనుభవమయింది.

పులిగడ్డ -- పారెపల్లి సూర్యనారాయణ
15-2-2001

## లేదన్నది లేనిదే గురుసన్నిధి

నేను డి. 27-01-2001న మా ఫ్రెండు నాగరాజుతో ఫోనులో మాట్లాడుతూ ఇక్కడ ఆశ్రమములో గురువుగారు లేరు, నాకు చాలా బోర్ గా వుంది అన్నాను. తరువాత రోజు ఉదయం 10 గంటలకు తెనాలి నుండి నాకు తెలిసిన కొందరు షిరిడీ వచ్చినారు. వారు ఇదే మొదటసారి రావడం. వాళ్ళకు ఏమీ తెలియదన్నారు. సరే అని అన్నీ చూపించినాను. తరువాత రోజు అనుకొన్నాను వాళ్ళతో తిరగడం వల్ల హారతులన్నీ మిస్ అయ్యాను. అప్పుడు అర్థమయ్యింది అది బోర్ కాదు బాబా సన్నిథిలో వున్న ప్రశాంతత అని.

డి. 28-01-2001 నాటికి నేను షిరిడీలో ఉండీ 4 రోజులు అవుతుంది. ఆ రోజు మధ్యాహ్నం అందరూ బాబాకు నైవేద్యం పెడుతుంటే చూచాను. ఇది శ్రమతో కూడినదని ఊరుకున్నాను. తరువాత బియ్యంకొని బాబాకు ఆవకాయ పచ్చడితో నైవేద్యం పెడదామని అనుకొన్నాను. కాని ఆ పచ్చడి ఎప్పటిదో అని ఊరుకున్నాను. ఆరోజు హారతి తరువాత ప్రసాదంలో నాకు ఆవకాయ ముక్క వచ్చింది. అప్పుడు అర్థమయింది నాకు (బాబాకు) రేపు నీవు నైవేద్యం పెడతావుగా అని బాబా నన్ను సూటిగా అడిగినారు. ఆ తరువాత రోజు వెంటనే బియ్యం, పాలు కొని బాబాకు ఆవకాయ పచ్చడితో నైవేద్యం పెట్టి సంతృప్తి చెందాను. ఇలా షిరిడీలో జరిగిన అనుభవాన్ని గురుబంధువులతో పంచుకొనుచున్నాను.

కేంప్ : షిరిడి జి.పి. సతీష్ కుమార్
31-01-2001

ధర్మానికి మారుపేరయిన "వృషనామ" సం||లో గురుబంధువులందరూ గురూజీకి ఇష్టమయిన ధర్మపథంలో పయనించేలా.. "గురుకృప"ను మనందరం గ్రహించాలని, గురుకృప నూతన సంవత్సర శుభాకాంక్షలు.

## A BRIGHT SUNSHINE IN EVERYDAY'S LIFE

Welcome to Sarath Babuji
A living incarnation of Sai Baba
How lucky am I
to see you with my own nacked eye



గురువును
(గురుస్వరూపాన్ని)
తెలుసుకో!

లేకపోతో
(ఈ లోకంలోకి)
ఎందుకొచ్చినట్లు?

పిడకలు
ఏరుకోవడానికా

--సాయిబాబా

As He moves
A Shirdi moves
As He smiles
A cold breeze flows

O God! Turn me into a rock, so that he may land.
O Heaven turn me into a flower, I may be one in His garland

Wash away cleanly my ego
Which is laying in me long ago

Let me open an account in your kindness bank


Your Hand guides us to cross the life bank
Almighty I can fight with you

Because, now I have a **Sath** guru
O Gurubandhus! I can tell you one thing

Catch hold our Guru, and leaveout everything. God instead of appearing before one and all showed us a Guru, **Sainathuni Sarat Babuji** to all. He is our bright sun shine in our everydays life.

We can get nothing without him in our life.

Swamiji, I will not forget your words.
One Dhyanam, One God and One Way



I am innocent, please show me your way How can I pay you your Gurudakshina. Except to have a flower of blind faith in you with one pradakshina.

**Tenali** — **P. DAKSHINA MURTHY**
**1996** — M.Com., M.Phil

"ఆలోచన - అవలోకన"

షిరిడీలో గురుదేవులను సందర్శించిన వెంటనే విద్యావేత్తకు, భోజరాజుని చూచిన వ్యక్తికి కవిత్వం ఆశువుగా పొంగి వచ్చిన తీరున, దక్షిణామూర్తిగారిక్కూడా అంతే. వారి భావుకతను ఆంగ్లభాషలో గేయంగా వ్రాసిన దాన్ని ప్రకటిస్తూ తెలుగుసేత గూడా దిగువున అందివ్వబడింది.

## నిత్యజీవితంలో సూర్యుని వెలుగులు

శరద్బాబూజీకి స్వాగతం, సాయి స్వరూపానికి ప్రతిరూపం.
నేనెంత అదృష్టవంతుడిని, నా విప్పారిన కన్నులతో మిమ్మల్ని చూడటం.
ఆయన నడవటమే షిరిడీ నడవటం.
ఆయన నవ్వితే - ఒక మలయమారుతం వీస్తోంది.

- ఓ దేవా నన్ను ఒక రాయిగా మార్చు, మీరు కూర్చునేందుకు.
- ఓ స్వర్గమా నన్ను ఒక పువ్వుగా మార్చు ఆయన దండలో ఒక పువ్వునైయ్యేందుకు
- ఎన్నేళ్ళనుంచో పాతుకుపోయిన నా అహంకారాన్ని శుభ్రముగా కడిగివెయ్యి.



"భక్తులకు ఐహికంగానూ, ఆముష్మికం గాను లాభం చేకూర్చడానికే మహాత్ములున్నది"

-- సాయిబాబా

- నీ దయా సముద్రము అనే బాంకులో నాకు ఖాతా తెరువు.
- మా సంసార సాగరాలు దాటటానికి మీ చేయి మార్గదర్శకమవుతుంది.

దైవమా - నేను నీతో పోరాడతాను. ఎందుకంటే నాకు ఒక సద్గురువు లభించారు.

గురు బంధువులారా, మీకొక విషయం చెపుతాను.

మన గురువును నమ్ముకోండి, మిగతా విషయాలను పూర్తిగా వదులుకోండి.

- దైవము ప్రతి ఒక్కరికి ప్రత్యక్షముగా కనపడకుండా మనకు గురువుగా సాయినాథుని శరద్బాబూజీని చూపారు.
- ఆయన మన నిత్య జీవితంలో అద్భుతమైన సూర్యకాంతి వంటివారు
- ఆయన లేకుండా మన జీవితంలో సాధించేదేమి లేదు
- స్వామీజీ, నేనెన్నటికి మీ మాటను ఒకే ధ్యానం, ఒకే దైవం, ఒకే మార్గం ను మరువను
- నేను అమాయకుడిని, దయచేసి మీరు మార్గం చూపించండి.
- నే నేవిధంగా మీకు గురుదక్షిణ సమర్పించగలను? ఒక ప్రదిక్షణ తోటి ధృఢ విశ్వాసమనే పుష్పాన్ని సమర్పించటం తప్ప.

తెనాలి -- పి. దక్షిణామూర్తి
1996

## ఆ ఋణానుబంధం ఏమిటి?

గురువుగారు మద్రాసు నుంచి శిరిడీ వెళ్ళు తిరుగు ప్రయాణంలో సెంట్రల్ స్టేషనులో భక్తులకు దర్శన మిచ్చారు. వారు ప్రయాణం చేసే రైలు ప్లాట్ ఫారం మీద ఆగి వుంది. గురుబంధువులందరూ బోగీ లోపలకు వెళ్ళి, గురువుగారికి నమస్కరించుకొని ఊదీ తీసుకొని బయటకు వస్తున్నారు. ఇది చూచిన చుట్టు ప్రక్కల వాళ్ళు ఎవరో శిరిడీ బాబా అట, శిరిడీ నుండి వచ్చారట అంటూ.. బోగీ వద్ద గుమిగూడి కిటికీలో నుండి గురువుగారిని చూస్తున్నారు. లోపల గురువుగారిని దర్శించుకొనే వారి సంఖ్య అధికంగా ఉండటంతో బయట వున్న వాళ్ళకు గురువుగారు సరిగ్గా కన్పించడం లేదు. ఆ మనుషుల మధ్య సందు వచ్చినప్పుడు, ఆ గ్యాప్ లోంచి గురువుగారిని చూస్తున్నారు. బయట వున్న వాళ్ళల్లో ఒకతను గురువుగారిని చూడాలనే ఆతృతతోను, వారి నుండి ఊదీ పొందాలనే తపనతోను, లోపల గురువుగారిని దర్శించుకొనడానికి వెళ్ళేవారితో ఏదో చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. కాని ఆ సందడిలో ఎవరు ఇతన్ని పట్టించుకోవడం లేదు. కొద్ది సేపటి తర్వాత గురువుగారు తన ప్రక్కనే ఉన్న డా.నరేంద్ర గారిని పిలిచి ఊదీ యిచ్చి, బయట వున్న ఆ వ్యక్తికి ఊదీ ఇచ్చి రమ్మన్నారు. ఆది అందుకొన్న ఆ వ్యక్తి మిక్కిలి ఆనందంతో, కృతజ్ఞతా పూర్వకంగా గురువుగారిని బోగీ వెలుపలి నుంచే నమస్కరించుకొన్నాడు. గురువుగారు లోపల నుండి చిరునవ్వుతో ఆశీర్వదించారు. ఆతని ప్రక్కన వుండి అతన్ని, గురువుగారిని గమనిస్తున్న నా కళ్ళు ఎందుకో చమర్చాయి. ఆశ్చర్యంతో కూడిన ఆనందంతో వాళ్ళిద్దరిని అలా చూస్తుండిపోయాను. తర్వాత ఆ వ్యక్తి అక్కడ నుండి వెళ్ళిపోయారు.

అందరిలో అతనికి మాత్రమే ఊదీ తీసుకోవాలన్న తపన ఎందుకు కల్గింది? ఆతని మనస్సులోని కోరిక గురువుగారికి ఎలా తెలిసింది? ఆతని కృతజ్ఞతాపూర్వకపు

చూపులకు, గురువుగారి చిరునవ్వుకు ఏమిటి అర్థం? అసలు వీరిద్దరి మధ్య ఉన్న ఆ ఋణానుబంధం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలు నా మనస్సులో మెదిలాయి. ఆర్తి, తపన ఉన్న భక్తుడు ఎక్కడున్నా భగవంతుడు అతని కోరిక తప్పక తీరుస్తాడని దానికిదొక నిదర్శనమని నాకర్థమయింది...

13-1-2001 -- రాధాబాయి

చెన్నై (చెన్నై సత్సంగ కేంద్రం) D/o సుబ్బారావు. BSM, APSRTC



ఋణాను బంధాన్ని విశ్వసించు...

ఎవ్వరూ తామంతట తాము వారి వద్దకు రారని, వారితో గల *'ఋణానుబంధం'* వల్ల ఆయనే (బాబా) వారిని తమ చెంతకు రప్పించుకొంటారని బాబా ఎన్నో సందర్భాలలో వివరించారు

## కిం వచనీయం గురు మహిమ

నేను గురువుగారి మహిమ గురించి ఇంతకు ముందు ఒకసారి "గురుకృప" ద్వారా నా అనుభవాన్ని తెలియచేయడం జరిగినది.

అయితే ఈ మధ్య అనగా 29-1-2001 న జరిగిన విషయం ద్వారా నేను ఇంతకు ముందటి నా అనుభవం కన్నా చాలా సంతృప్తి మరియు ఆశ్చర్యము కూడా కలగ చేసినది. అది ఏమనగా నాకు వ్యాపార రీత్యా వచ్చిన ఒక చెక్కు డిస్ హానర్ అయినందువలన నేను అతనిపై కోర్టులో కేసు వేసినాను. ఆ కేసు విషయమై మా వలన చిన్న పొరపాటు జరిగినందున ఆ కేసులో నేను గెలవడం జరగదని మా లాయర్‌గారి ద్వారా నాకు జడ్జిమెంటుకు 20 రోజులు ముందే తెలిసినది. అయితే జడ్జిమెంటు తేది అనగా 29-1-2001న మా లాయర్‌గారు నన్ను ఆ రోజు సాయంత్రం 3 గంటలకల్లా కోర్టుకు వెళ్ళండి అని నాతో చెప్పారు. నాకయితే అప్పటికీ ఎలాగూ ఆ కేస్ పోతుందని, దాని కోసం కోర్టుకు వెళ్ళడం కూడా దండగని అనిపించింది. నాకు ఎంతో నిరుత్సాహంగా ఉన్నది. ఆవతల వ్యక్తి ఈ కేసు తనకి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆనంద పడ్డాడు. ఆయన సంతోషానికి అంతులేదు. అది ఈ కేసు విషయంలో మా ఇద్దరి పరిస్థితి. కాని ఆ కేసు విషయం గురించి చెప్పాలంటే ఇంకా వేరే కేసు ఏదైనా గెలవక పోయిన ఫరవాలేదు, ఈ కేసులో ఓడిపోవడం జరగకూడదని నా అభిప్రాయం. అయితే ఈ విషయం గురువుగారికి మనస్సులో అప్పటికే చెప్పుకోవడం జరిగినది. అలా కోర్టుకు వెళ్ళవద్దని అనిపించి, మళ్ళా కోర్టుకు వెళ్ళకుండా నేను తప్పు చేయడం ఎందుకు, ఎలాగు గురువుగారికి చెప్పుకోవడం జరిగింది కదా అని జడ్జిమెంటు వినడానికి కోర్టుకు వెళ్ళాను. మెజిస్ట్రేటుగారు 5-30 నిముషాలకు జడ్జిమెంటు చదివి వినిపించారు. విషయము ఏమిటంటే ఈ కేసు విషయములో నాకు అనుకూలముగా తీర్పు చెప్పినారు. నా సంతోషానికి అవధులు లేవు. వెంటనే అదే నిముషములో కోర్టు హాల్లో నేను గురువుగారికి మనసులో పాద నమస్కారములు తెలియచేసుకొన్నాను. ఇప్పటికి గురువుగారు నాకిచ్చిన అనుభవములలో ఈ అనుభవం నాకు చాలా సంతృప్తి కలుగ చేసినది. తీర్పు రావడానికి ముందు అతనికున్న సంతోషం, తీర్పు వచ్చిన తరువాత నాకు కలిగింది.

విశాఖపట్నం -- డి. జనార్ధన రావు

11-2-2001



*గురు మహిమ...*
*గురు మహిమ...*

*అపార మహిమ*
*గురు మహిమ...*

*కిం వచనీయం*
*గురు మహిమ!*

*కిమ వచనీయం*
*గురు మహిమ!!*

*సచ్చిదానందం*
*గురు మహిమ!*

*పతిత పావనం*
*గురు మహిమ!!*

*గురు మహిమ!*
*గురు మహిమ!*

*అపార మహిమ*
*గురు మహిమ...*

## బాబాని నమ్ముకో...

బాబా ఆశీస్సులకి ఒక్కొక్కసారి మన ప్రారబ్ధం అడ్డువస్తుంది. కానీ అది గురుకృపచే తొలగిపోతుంది అనే విశ్వాసంతో నా అనుభవం. నేను చెవిపోటుతో చాలా బాధ పడేదాన్ని. గురువుగారు విజయవాడ మీదగా వేరే ఊరు వెళుతూ మా కోరిక మీద బ్యారేజి దగ్గర ఉన్న పార్కులో గురువుగారికి వసతి ఏర్పాటు చేసారు. మేము అందరం దర్శనానికి వెళ్ళాము. అప్పుడు గురువుగారికి నా సంగతి చెప్పి బాగా ఏడ్చాను. అప్పుడు గురువుగారు దగ్గరికి పిలిచి, ప్రక్కన కోర్చోపెట్టుకొని కొంచెం సేపు ధ్యానం చేసి నాకు ఊదీ ఇచ్చారు. ఆ సాయంత్రం సత్సంగం జరుగుతున్న సమయంలో సార్ ఫోటో చూస్తూ భజన చేస్తున్నాను. అప్పుడు సార్ నవ్వుతూ చెవి గీక్కున్నట్లుగా కనిపించింది. నిజంగా సార్ వచ్చారేమో అనుకున్నాను. ఆ తరువాత రోజు నేను మాట్లాడుతూనే పడుకున్నాను. అప్పుడు బాబా నా చెవికి ఆపరేషన్ చేస్తున్నట్లు, సార్ ప్రక్కనే ఉన్నట్లు కలవచ్చింది. అప్పుడే మా మమ్మి వచ్చి నన్ను లేపింది. మా మమ్మి లేపకుంటే నా ఆపరేషన్ పూర్తి అయ్యేది. కాని నా ప్రారబ్ధం నాకు అడ్డు వచ్చింది. ఆ తరువాత రోజు నేను స్కూలుకి వెళ్ళాను. కాని నాకు క్లాస్‌లో కూర్చున్నా నా మనస్సులో సార్‌ని కలిసిన చోటకి వెళ్ళాలని, బాగా ఏడుపు వస్తుంది. కాని నాకు దారి తెలియదు. కాని లంచ్‌రూం లో ఆయా తెచ్చిన కేరేజి తిని స్కూలుకి వెళ్ళకుండా బ్యారేజి దగ్గరికి వెళ్ళాలని, మేము కారులో వెళ్ళిన గుర్తులను బట్టి ఆ స్థలముకి వెళ్ళాను. కాని అక్కడ గేట్‌మేన్‌ని చూసి భయపడి ఏడుస్తూ ఇంటికి వచ్చాను. తరువాత మా డాడీ నన్ను ఆ స్థలముకి తీసుకెళ్ళారు. ఇప్పటికి ఆ బ్యారేజి మీదకి వెళ్ళినప్పుడల్లా ఆ స్థలములో సార్ కూర్చున్నట్లుగానే నమస్కారం చేసుకుంటాను. కానీ నా సమస్య పరిష్కారం అవ్వలేదు. గురువుగారికి చెప్పుకుంటే ఆ టైమ్ వచ్చినప్పుడు తప్పకుండా జరుగుతుంది, నీవు బాబాని నమ్ముకో అన్నారు. నా సమస్య గురువుగారే తీరుస్తారనే పూర్తి విశ్వాసం నాకుంది. దాని కోసం నేను ఏ మందులు వాడలేదు.

1996 -- గ్రంధి సుష్మిత
విజయవాడ D/o పద్మజ శివయ్య

## అదే అనుగ్రహం.. ఇదే నిదర్శనం

నేను గురువుగారిని మొదటగా తెనాలి, ఉదయ శంకర్ కళ్యాణ మండపము వద్దకు వచ్చినప్పుడు, సాయిబాబా కోసం వారిని దర్శించాను. ఆ తరువాత 1996, మార్చిలో తిరుపతి వచ్చినప్పుడు, కేవలం వారి దర్శనం కోసమే వారిని దర్శించాను. ఈ రెండింటి దర్శన సమయాల్లో నాకు కలిగిన మానసిక ఆనందాల్లో తేడాను మాటల్లో చెప్పలేను. తిరుపతిలో వారి దర్శనము చేసుకోవడం అనేది కేవలం మనం ఎన్నో జన్మలనుండి చేసుకున్న పుణ్యఫలం తప్ప వేరేది కాదని నా అభిప్రాయం. వారి తేజవంతమైన రూపం ఇప్పటికీ నా కళ్ళముందే ఉన్నది. వారిని దర్శించడం వల్ల కలిగిన ఆనందాన్ని ఎన్నో రోజుల వరకు కూడా నేను పొందాను. అటువంటి మహానుభావుడు మాకు గురువుగారుగా లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను.

నేను 1993, ఏప్రిల్ లో కాకతీయ యూనివర్సిటీ నుండి B.A.(Lit) వన్ సిటింగ్ కి అప్లై చేసినప్పుడు, ఆఖరి సంవత్సరం English Literature లో IV Paper drop చేద్దామనే ఉద్ధేశ్యంతో కేవలం 45 మార్కులకు మాత్రమే ఆన్సర్ చేశాను. నేను అనుకొన్నది ఆ Paper next year వ్రాద్దామని. కాని, బాబా రూపంలో మాకు చేరువవుతున్న గురువుగారు మాత్రం అలా చేయలేదు. నేను ఆ సంవత్సరమే డిగ్రీ పాసయ్యాను. వెంటనే, భారతీదాసన్ యూనివర్సిటీ వాళ్ళ B.Ed. అడ్మిషన్ నోటిఫికేషన్ పడటం, నేను చేరడం, ఆ పరీక్షల్లో కూడా నేను పాస్ అవడం ఒక కలలాగ జరిగింది. ఇది ఖచ్చితంగా గురువుగారు నన్ను అప్పటినుండి కనిపెడుతున్నారని నిరూపిస్తుంది. నాకు 1995, జూన్ లో B.Ed. సర్టిఫికేట్ వచ్చింది. ఆ తరువాత 1996, జనవరిలోనే Z.P., M.P. Teacher Posts నోటిఫికేషన్ పడింది. నాకు తెలిసి ఈ Recruitments కి Atleast 3 to 4 years gap ఉంటోంది. కానీ, నా విషయంలో మాత్రం నా డిగ్రీ చేతికొచ్చిన అతి కొద్ది కాలంలోనే గురువుగారి అనుగ్రహం వల్ల ఈ నోటిఫికేషన్ వెలువడింది. ఇంతకంటే గురువుగారి కరుణ మనపై ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పడానికి వేరే నిదర్శనం కావాలా?



బాబా కృపాదృష్టి మన మీదున్నదన్న గుర్తే ***(ఎఱుకే)***, మనకు గురువై మనలను రక్షించి తరింపచేస్తుంది

-- శ్రీ బాబూజీ

మరల, అతి త్వరలో వారి దర్శన భాగ్యం నాకు, మనందరికీ కలగాలనీ, గురువుగారిపై నాకు విశ్వాసాన్ని రోజురోజుకూ పెంచాలనీ, బాబా పాదసేవలోనే మనందరం నిరంతరం మునిగి తేలేట్లు గురువుగారు అనుగ్రహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ...

బుర్రిపాలెం
24-6-96

-- పి. రాజ్యలక్ష్మి

## ఆ రూపం అపురూపం

సాయిబాబాకు, పూజ్యశ్రీ గురువుగారికి నా సాష్టాంగ ప్రణామములు. నా పేరు హనుమేశ్వరి. మాది శేకూరు. నేను బి.కాం. మూడవ సంవత్సరము చదువుచున్నాను. మే, 27వ తేదీన మా ఇంటి వద్ద గురువుగారికి ఒక ఉత్తరము వ్రాసినాను. అది ఏమిటంటే, షిరిడీలో గురువుగారి దర్శన భాగ్యం కల్గించమని వ్రాసినాను. కాని ఆ ఉత్తరము పోస్టు చేయలేదు. కానీ నేను కోరినట్లుగానే ఆ మరుసటి రోజు రాత్రి నాకు ఒక స్వప్నము వచ్చినది. ఆ స్వప్నము ఏమిటంటే, నేను, నా ఫ్రెండ్స్ కలసి కాలువ ఒడ్డున చదువుకొనుచున్నాము. ఆ సమయంలో గురువుగారు నాకు కొద్ది దూరంలో ప్రత్యక్షమైనారు. నేను గురువుగారిని చూడగానే నా మనస్సు ఎంతో ఆనందముతో నిండింది. అప్పుడు నేను, నా ఫ్రెండ్స్‌కి "శరత్ బాబూజీ" గారు అని చెప్పినాను. అంతలో గురువుగారు నన్ను దగ్గరకు రమ్మని చేతితో సైగ చేసినారు. కాని నేను నన్ను కాదేమో అనుకొని ప్రక్కకు చూసినాను. కాని గురువుగారు నిన్నే అన్నట్లు పిలిచినారు. అప్పుడు నేను ఆనందంతో "శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ! సద్గురు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ కీ! జై!" అనుకుంటూ దగ్గరకు వెళ్ళినాను. నేను దగ్గరకు వెళ్ళగానే గురువుగారు నన్ను కోర్చోమన్నారు. నేను కూర్చున్న తరువాత గురువుగారి వంక చూసినాను. అప్పుడు నాకు గురువుగారి ముఖంలో ఎంతో దివ్యతేజస్సు విరాజిల్లుతున్నట్లు కన్పించింది. ఇంతలో గురువుగారు నన్ను సత్సంగము గురించి

అడిగినారు. ప్రతి గురువారం సత్సంగము నేనే చేస్తున్నాను అని చెప్పినాను. ఇలా మాట్లాడుతూ ఉండగా కాలువ వద్దకు ఎవరో వచ్చినట్లు ఉన్నారు. అప్పుడు గురువుగారు ఒక దివ్య జ్యోతిగా మారి అదృశ్యమైనారు.



"అనుగ్రహించడమే నా పని!"

"My business is to give blessings"

-- Sai Baba

ఆ విధంగా గురువుగారు స్వప్న రూపంలో వారి యొక్క దర్శన భాగ్యం కలిగించి షిరిడీ వెళ్ళకుండానే నా కోర్కెను తీర్చినారు. నా యొక్క కోర్కెను స్వప్న రూపంలోనే తీర్చిన గురువుగారికి పాదాభివందనములు తెలియచేసుకొనుచున్నాను.

శెకూరు — -- డి. హనుమేశ్వరి

15-6-2001

ఆ చేయి ఎంత హాయి... భాగము 12

## సామాన్య జీవనమే సర్వ సమర్థకు మూలం

సందేహాల్రావు, డౌటాఫ్ థామస్, అనుమానాల పుట్ట, సంశయాల గుట్ట. ఇలాంటి వన్నీ ఒకే తావు చేరి ఆకారం దాల్చిన రూపమే ఈ రచయిత. ఈ విషయంలో ఎవ్వరికి ఎలాంటి సందేహములేదు. గురువుగార్ని చూడడంలో ఎంతో ఆనందముంది. అందులో అనుమానమేముంటుంది. అలాగే గురువుగారు చెప్పే మాటల్లో ఎంతో హితవుంటుంది, అంతరార్థముంటుంది, ఆలోచనముంటుంది, విజ్ఞానముంటుంది, జ్ఞానముంటుంది. సత్యముంటుంది, మూర్తీభవించిన ధర్మముంటుంది, విశేషించి ఆచరణ ముంటుంది. ఈ ఆచరణ మన్నదే లక్షలాది మంది వారిని ఆరాధించడానికి మూలహేతువైతున్నది.

ఒకానొక సందర్భములో "వ్యక్తిత్వపు విలువలు" మర్చిపోవాలనే పదమును పయోగించారు గురువుగారు. ఆ మాటే ఒక అద్భుతమైన అంశానికి మూల బీజమైంది. "మానిషాదా..." అనే శ్లోకం ఆదికావ్యావిర్భవానికి ఆదియై నిషాదుణ్ణి ఆదికవిగా తీర్చిదిద్దగల్గిన రీతిగానే, గురువచనాల పట్ల శ్రద్ధా భక్తులతో పాటు, ఆలోచన, ఆచరణ, చూపగలిగితే మనలోని కిరాతక భావాలకు స్వస్తి పల్కి రాతమారి మరో వాల్మీకిగా పునరుద్భవించగలరు. అప్పుడే కల్మషాలు, మాలిన్యాలు తొలిగిపోయి మానవత్వం వెలుగొందాలన్నా, మానవత్వం పరిమళించాలన్నా, మానవత్వం పచేళిమం చెందాలన్నా మనిషి మనిషిగా వికసించాలన్నా - గురుపథంలో పయనించడం కంటె మించిన గమ్యము మరొకటి లేదు. గురుపథమనే ఔషధమే మలిన భావాలను, రోగాలను నాశనము చేయగలదు. ఆ బాటలో నడవగలిగితే అంతకు మించిన సాధన మరొకటి ఉందని అనిపించదు. అంతర్వాహినిలా ప్రవహించె తపమిదే.

వ్యక్తిత్వపు విలువలంటే అవగాహనకు వచ్చే ముందు గురువుగారి ఆచరణ, సామాన్య జీవనము, వారి వేషము, నివసించే విధానము, మొ|| అంశాలు తెలియాలి. అప్పుడే గురువుగారిలోని మహోన్నత మనీషత్వము బోధపడుతుంది. శిరిడీలో గురువుగారు చిన్నగదిలో నివాసముంటారు. దానికి అద్దె గూడా ఉంది. 10 X 12 వైశాల్యంగల గది. అంతకంటే చిన్న వంటగది 10 X 12 వైశాల్యమున్న ఆగదిలోనే రెండు బీరువాలు, వారి పుస్తకాలు. అక్కడే వారి పడక. వారికెదురుగా పెద్దది బాబా ఫోటో




"భక్తులకు
ఐహికంగానూ,
ఆముష్మికం గాను
లాభం చేకూర్చడానికే
మహాత్ములున్నది"

-- సాయిబాబా

ఒకటి. మరో ఇద్దరు ఆ గదిలో గురువుగార్ని కలవాలంటే ఎంతో ఇరుకు. అయినా ఓపికగా ఆనందంగా వారి సమస్యలు చెప్పి వెళ్ళిపోతారు. గురువుగారు వాటినన్నింటిని బాబాకు నివేదన చేస్తారు. వారి చదువు, వ్రాత, సమస్తమక్కడే. ఇలాంటి సమయంలోనే ఆ ఇంటి యజమాని రిపేర్లు ప్రారంభించారు. గురువుగారికి ఎంతో అసౌకర్యమేర్పడింది. బాబా వ్యాసాలు వ్రాయాలి గదా? ఆపోర్షన్ ఖాళీ చేసి మరో బాడుగ ఇంటికి వెళ్ళకతప్పలేదు.

రాత్రిపూట గురువుగార్ని సందర్శించే వ్యక్తులు వందల సంఖ్య దాటి వేల సంఖ్యకు పెరిగింది. గురువుగార్ని ఇన్ని వేల మంది ఎందుకు దర్శించుచున్నారో మొదట నాకు అనుమానం కలిగింది. వ్యర్థంగా ఎవరు రారు. వస్తున్నారంటే వారికి ఏదో లాభముండి తీరాలి. అని అనిపించి చాలా మందిని కల్సినాను. వందలాది రూపాయలు చార్జీల విషయంగా మీరు ఎందుకు ఖర్చు చేస్తున్నారు? వచ్చిన వారే మళ్ళీ మళ్ళీ, మళ్ళీ మళ్ళీ వస్తున్నారు ఎందుకు? నెలల తరబడి ఇక్కడ ఉంటున్నారు ఎందుకు? సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న మీరు ఇక్కడ పొందుతున్నది ఏమిటి? మీ ప్రాంతాలలో ఎన్నో ఆశ్రమాలు, ఎంతో మంది మఠాధిపతులు, ఎంతో మంది పీఠాధిపతులు, ప్రచార పర్వంలో నిమగ్నులైన సాధు సన్యాసులున్నారుగదా? ఇక్కడ మీకు కలిగిన తృప్తి ఏమిటి? ఇక్కడకు వచ్చినప్పుడల్లా మీరు పొందుతున్న ఆనందమేమిటి? ఎంతో మంది ఆశీర్వాదాలు పొందిన మీకు ఇక్కడ ఈ చేతి హాయి ఏమిటి? ఇలాంటి ప్రశ్న పరంపరలు ఎన్నింటినో రెండు నెలల కాలము నేను అక్కడ ఉండి, వచ్చిన వారితో నా సందేహాల లిస్టు విప్పేవాడిని.



స్వామి దయవలన నా ఆరోగ్యం బాగైంది.

స్వామికి మీరేమన్నా కృతజ్ఞతా పూర్వకంగా సమర్పించారా? లేదండి... వస్తు, ధన రూపేణ ఏమి ఇవ్వలేదు.

వారి అనుగ్రహంతో మా అమ్మాయికి వివాహమైంది. మీరేమన్నా సమర్పించారా?

అమ్మాయి పెండ్లి శుభలేక తప్ప ఏమీ ఇవ్వలేదు.

మానసికంగా కృంగిపోతున్న నాకు ఆ ఒడిలో ప్రశాంతత లభించింది.

మీ కృతజ్ఞతను ఎలా ప్రకటించారు?

నమస్కరించడం కన్నా నేనేమి చేయలేదు. వారి ఆశీర్వాదంతో ఎంతో కాలంగా రావాల్సిన పాత బాకీలు, మొండి బాకీలు నా చేతికి అందాయి.

ఆందుకు మీరు ప్రతిఫలంగా... రామ... రామ... అలాంటిదేమీలేదు.
ఈసారి తప్పక పరీక్షల్లో తప్పిపోతాననుకున్న నేను మంచి మార్కులతో గురుదేవుల అనుగ్రహంతో పాస్ అయినాను.

గురువుగార్కి ఒకే ఒక్కసారి విన్నవించాను. ఇంజనీరింగ్ లో సీటు రావాలని. వచ్చింది.



*భగవంతునికీ*
*భక్తునికీ*
*మధ్య వర్తించే వారధి*
*వాహనము -*
*భాగవతుడు*
*(గురువు). ఆయన*
*మార్గదర్శి. మార్గము*
*కొంచెం సూక్ష్మంగా*
*పరికిస్తే - గమ్యం*
*కూడా!*

*-- శ్రీ బాబూజీ*

కేవలం ఉత్తరం ద్వారా! విన్నవించాను. నేను పొందాలనుకున్నది పొందాను. నా వ్యాపారంలో నాకు నష్టం రాకుండా గురువుగారి ఆశీర్వాదమే ఆదుకుంది. ఆదాయపన్ను శాఖనుంచి నాకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మహానుభావుని అనుగ్రహం అండగా నిల్చింది.

నాకు ఉద్యోగమొచ్చింది. నాకు ప్రమోషన్ వచ్చింది. నాకు బాగా కల్సివచ్చింది.

పిల్లలు లేని నాకు సంతానం కలిగింది. గురువుగారి వచనమే నన్ను ఇల్లు కట్టుకునేలా చేసింది.

లక్ష రూపాయలు ఖర్చు చేయవలసిన చోట పైసా గూడ ఖర్చు చేయకుండా నా ఆరోగ్యం మెరుగుపడింది.

ఈ సంవత్సరం నాకు ఆదాయం బాగుంది. వ్యాపారం అభివృద్ధి చెందింది.

నా స్కూల్లో పిల్లలు పెరిగారు పట్టణంలో రిజల్ట్స్ విషయంలో మాదే ముందున్న కళాశాల.

మా గ్రామంలో బాబా మందిర నిర్మాణం వారి చలువే మా గ్రామంలో సత్సంగం వారి ఆశీర్వాదంతోనే అభివృద్ధి చెందింది. వారితో పరిచయమైన తరువాతే బాబా అంటే ఏమిటో తెలుస్తున్నది.

వారితో పరిచయమైన కారణం గానే నేను ఎన్నో సార్లు బాబాను చూడగలిగాను. శిరిడీకి ఇన్నిసార్లు వెళ్ళానంటే వారి అనుగ్రహమే. మందిచ్చినా తగ్గని భయంకర రోగాలు వారి చేతి మీదిగా ఊదీ తీసి కొసిన తరువాతే తగ్గింది.

డొనేషన్ లేకుండా మద్రాస్ ఇంజనీరింగ్ లో సీటు వచ్చింది. గురువుగార్ని ప్రార్థించిన తరువాతే నాకు హోమియోలో అనుకున్నచోటే సీటు చాలా తేలికగా వచ్చింది. నాకు బదిలీ అయింది. నేను ఎలాంటి ప్రయత్నము చేయలేదు. అప్లికేషన్ పెట్టే ముందు గురువుగార్కి నా కోర్కెను వివరించాను. 'బాబా' ఉన్నారు, మనకేది కావాలో దాన్నే చేస్తారు. అమెరికాలో ఉద్యోగం చేయాలని ఉంది. బాబా అనుగ్రహిస్తారు. తప్పక వెళ్ళుదువుగాని. అమెరికాకు వారంలో వెళ్ళిపోయారు.

"లండన్" వెళ్తాను. బాబా ఏర్పాటు చేస్తారు. లండన్ వెళ్ళిపోయాడు.

ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయమేమంటే విదేశాలనుంచి వేలాది మంది వచ్చి గురువుగారి సన్నిధిలో సంవత్సరాల తరబడి కాలాన్ని ఆనందదాయకంగా అర్థవంతంగా గడుపుకుంటున్నారు. మన మేమో విదేశీ సంపదపై వ్యామోహంతో వందలాది మంది ఈ సన్నిధిని వదిలి ఆ పెన్నిధికై ఎగబ్రాకుతున్నారు. నవ్వుకోవాల్సిన విషయమే.

ఇలా ఆర్థార్దుల లిష్టు ఇవ్వదలిస్తే ఈ రాష్ట్రంలోని ఓటరుల లిష్టు చాలదు. అర్థార్దులే కాదు, వారి సన్నిధిలో లబ్ధిదారులయ్యేది. ఆర్తులతో పాటు, జిజ్ఞాసువులు, మోక్షాపేక్షాపరులు లేకపోలేదు. వారి విషయం తరువాత ప్రస్తావించుకుందాము. లక్షలాది మంది వచ్చి స్వామిని దర్శించుతున్నారంటే వారివారి కోర్కెలు తీర్చడమే ప్రధానం. కోరికలు తీరడమే ప్రధానంతో పాటు ఇంత మందిని ఆకర్షిస్తున్నది ఏమిటి? అని యోచించితే. ప్రతిఫలాపేక్షరహితముగా అనుగ్రహించడమే ఇందుకు కారణం.

కోటి రూపాయలు ఆదాయం వచ్చిన వ్యక్తి తనను ఆశీర్వదించి అనుగ్రహించిన తన దైవానికి ఏమి సమర్పించావని అడిగితే వారి చరణాలకు నమస్కరించే భాగ్యమే తప్ప నా నుండి ఆశించింది ఏమిలేదు. భక్తి పూర్వకంగా వారి పాదాల ముందు పండును సమర్పిస్తే ఆ పండును "బాబాకు" చూపించి వెంటనే ఆ వెనకాల వున్న వారికి ఇచ్చేస్తారు. అక్కడ ఇలాంటి ఫలాలను ఎందరు ఎన్ని సమర్పించినా! చివరకు అవన్నీ వారిని సందర్శించిన సందర్శకులకే చేరుతున్నాయి.

ఎవ్వరినుంచి ఏమీ ఆశించరు. ఏమిచ్చినా తీసుకోరు. ఇంత సింపుల్ గా ద్రవ్యాపేక్షలేని మహనీయుడు ఎక్కడ లభిస్తాడని సందర్శకులన్నారు. ఆయన పేరు మీద ఆశ్రమాలు, కట్టడాలు లేవు. ఈరోజుకు అద్దె భవనంలోనే వారి నివాసం. వారి ఆశీస్సులకోసం వారి అనుగ్రహం కోసం వారి చూపుకోసమే ఉండేవారి కోసంగా రోజు వారిగా కాలినడకన అద్దె ఇంటినుచి సాయియానా దాకా వస్తున్నారు.

ఆసక్తికరమైన అంశాలకై ఆతృతతో వేచి ఉంటే ఈ మారు మరిన్ని విశేషాలు

డా. యస్. సాయివర ప్రసాదరావు, రీడరు : రేపల్లె

a a a a a a



*All the switches are at Baba's fingertips. With just one flick of a finger, he can give or change an experience.*

*-- Sri Babuji*